## షార్ట్ సర్క్యూట్‌తో టాటాఏస్ వాహనం దగ్ధం

చిల్పూరు, డిసెంబర్ 12 : షార్ట్ సర్క్యూట్‌తో టాటా ఏస్ వాహనం దగ్ధమైన ఘటన వరంగల్-హైదరాబాద్ హైవేపై కరుణాపురం వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నుంచి జనగామ వైపు వస్తున్న ప్యాసింజర్ టాటాఏస్ వాహనంలో పొగలు వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు రావడంతో గమనించిన డ్రైవర్ కరుణాపురం సమీపంలో వాహనాన్ని ఆపి ప్రయాణికులను దించాడు. దీంతో ప్రాణనష్టం తప్పింది. అనంతరం కొద్దిసేపట్లో వాహనం దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై హరికృష్ణ, ఏఎస్సై జయకుమార్ తెలిపారు.



దగ్ధమైన టాటా ఏస్ వాహనం



గ్యామతండాలో ఓ ఇంటి వద్ద చదువుకుంటున్న భద్రు

# పాపం భద్రు

- జాయింట్ సెల్ ట్యూమర్ వ్యాధితో నరకం
- కీళ్ల మధ్యలో కంతులతో నడవలేని దుస్థితి
- చిన్నతనంలో నాన్న వదిలేశాడు.. అమ్మ మానసిక దివ్యాంగురాలు
- అమ్మమ్మ ఇంటి వద్దే విద్యాభ్యాసం
- చదువుపై మక్కువ ఉన్నా సహకరించని ఆరోగ్యం
- లక్షలు ఖర్చుచేసినా నయం కాని రోగం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

**తన స్థాయికి మించి ఎవరైనా కష్ట పడుతుంటే అయ్యో 'ఈ కష్టం పగోడికి కూడా రావొద్దు' అని జాలి చూపుతాం. అతడికి అంతో ఇంతో సాయం చేయాలనుకుంటాం. సరిగ్గా ఈ 23 ఏళ్ల యువకుడు నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామ పరిధిలోని గ్యామతండాకు చెందిన అజ్మీరా భద్రు కూడా చదువు కోసం పడరాని పాట్లు పడుతున్నాడు. నాన్న లేడు.. అమ్మ ఉన్నా మానసిక దివ్యాంగురాలు.. ఇళ్లు లేదు.. వాకిలి లేదు. అయినా మొండి ధైర్యంతో చదువుకుంటున్న ఆ యువకుడికి జాయింట్ సెల్ ట్యూమర్ వ్యాధి సోకింది. కీళ్ల మధ్య కంతులు ఏర్పడడంతో లేచి నిలబడలేని, నడవలేని దుస్థితి. చదువుకోవాలనే కోరిక ఉన్నా ఆరోగ్యం సహకరించక నరకం చూస్తున్నాడు. దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కన్నీటి పర్యంతమవుతున్నాడు.**

నర్సింహులపేట, డిసెంబర్ 12 : నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామ పరిధిలోని గ్యామతండాకు చెందిన అజ్మీరా సుగుణకు భద్రు ఒక్కడే సంతానం. సుగుణ మానసిక దివ్యాంగురాలు. భద్రు చిన్నతనంలో తండ్రి వదిలేయడంతో తల్లితో కలిసి అదే తండాలో అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగాడు. కడుపేదరికంలో ఉన్నా చదువుపై మక్కువతో ఇంటర్ పూర్తి చేశాడు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు గ్యామ తండాలో, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దంతాలపల్లి ఎస్టీ హాస్టల్‌లో పూర్తి చేశాడు. తర్వాత 2017-18లో జీఎంఆర్ ఆదిలాబాద్‌లో పాలిటెక్నిక్ చదువుతున్న సమయంలో జాయింట్ సెల్ ట్యూమర్ వ్యాధి సోకింది. కీళ్ల మధ్య కంతులు ఏర్పడి నడవలేని పరిస్థితి వచ్చింది. చుట్టు పక్కల వాళ్లు తలా కొంత పోగు చేసి ఆపరేషన్ చేయించినా ఫలితం లేకపోయింది. చదువుపై మక్కువతో మొండిధైర్యంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ప్రస్తుతం అతడి పరిస్థితి దారుణంగా మారింది. ప్రతి రోజూ కళాశాలకు వెళ్లేందుకు డబ్బులు లేక, తండాలో నిలువ నీడలేక స్థానిక పాఠశాల, తండాల్లోని పలువురి ఇండ్లలో తలదాల్చుకుంటున్నాడు. ఇంత ఇబ్బంది ఉన్నా అధైర్యపడకుండా ఇంటర్ చదువుతున్న సమయంలో పెద్దముప్పారం గ్రామంలోని అమ్మఒడి వృద్ధాశ్రమంలో సోషల్ వర్కర్‌గా పనిచేశాడు. కానీ, రోజురోజుకూ వ్యాధి ముదిరి లేని నిలబడలేని, నడవలేని పరిస్థితితో నరకం చూస్తున్నాడు. నడిచేందుకు ఇతర వ్యక్తుల సాయం అవసరమవుతున్నదని కన్నీటి పర్యంతమవుతున్నాడు. భద్రుకు మెరుగైనవైద్యంతోపాటు చదువుకునేందుకు, ఇల్లు కట్టుకునేందుకు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. సహాయం చేయదలుచుకున్న దాతలు ఫోన్ నంబర్ 9959408173 ద్వారా సహకరించాలని వేడుకుంటున్నాడు.

## దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకెళ్లాలి

జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్, డిసెంబర్ 12 : దివ్యాంగులు మనోధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించగా, డేవిడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. క్యారమ్స్‌లో మొదటి స్థానంలో నిలిచిన డీ భాగ్య, వీ శైలు, సుదర్శన్, చెస్‌లో మాధురి, జావెలిన్‌త్రోలో పీ మగువ, వీ రఘు, పీ నగేశ్, సతీశ్, షార్ట్‌పుట్‌లో చిత్ర సతీశ్, డీ భాగ్య, బీ నరేశ్, డీ విజయ్‌కుమార్, ట్రై సైకిల్‌లో 125 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీశ, డీఈవో రామారావు, జిల్లా స్పోర్ట్స్ అధికారి అనిల్, వీ బాలకృష్ణ, ఎస్కే ఖాజా, సునీల్, రసీదా, సీడీపీవో దెబోరా, వాహిని, పీఈటీ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ చాంప్లానాయక్, పద్మావతి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇమామ్, వీరభద్రం, ప్రవీణ్, వర్మ, రాజకుమారి, అరుణ, శ్రీనివాసులు, భిక్షపతి, వెంకన్న పాల్గొన్నారు.



దివ్యాంగుల ఆటల పోటీలో క్యారమ్స్ ఆడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్



మేడారంలోని జంపన్నవాగు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో అంకిత్

# భక్తులకు ఇబ్బంది కలుగొద్దు

- అవసరమైన పనులు ప్రారంభించాలి
- ప్రతి సౌకర్యం ప్రజలకు ఉపయోగపడాలి:ఐటీడీఏ పీవో అంకిత్
- మహాజాతరపై అధికారులతో సమావేశం, మేడారంలో పలు ప్రాంతాల పరిశీలన

తాడ్వాయి, డిసెంబర్ 12 : వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మేడారంలో మంగళవారం గ్రామీణ నీటి పారుదల, విద్యుత్, గిరిజన సంక్షేమం, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో కల్పించనున్న సౌకర్యాలు, జాతర కోసం ప్రతిపాదించిన పనులు, సిబ్బంది సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకలగుట్ట, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రస్తుతం జాతర పరిసరాల్లోని మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, ఇన్‌ఫిల్ట్రేషన్ బావులు, దుస్తులు మార్చుకునే గదులు, లైటింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల ఏర్పాటు తదితర పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతరలో ఏర్పాటు చేసే ప్రతి సౌకర్యం భక్తులకు అందేలా చూడాలన్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారం మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, అధికారులు మహాజాతర ఏర్పాట్ల వివరాలను సిద్ధం చేసుకోవాలని అంకిత్ సూచించారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

దామెర, డిసెంబర్ 12: ఊరుగొండ సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం జరిగింది. వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ హెయిర్‌వత్ బస్సు హనుమకొండ నుంచి ఏటూరునాగారం ప్రయాణికులతో బయల్దేరింది. ఓగ్లాపూర్-ఊరుగొండ మార్గమధ్యలో పవర్‌గ్రిడ్ దాటిన తర్వాత పెట్రోల్‌బంక్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పత్తి చేనులోకి దూసుకెళ్లింది. ప్రభుత్వ టీచర్ అయేషా, కానిస్టేబుల్ శివకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మరో పదిమందికి స్వల్పగాయాలు కాగా, వరంగల్‌కు తరలించారు. బస్సులో 33మంది ఉన్నట్లు కండక్టర్ జవహర్‌లాల్ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ డీఎం సురేశ్ సందర్శించారు.



పత్తి చేనులోకి దూసుకెళ్లి ఆర్టీసీ బస్సు

## 'ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపురం, డిసెంబర్ 12: కొత్తూరులో ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులపై వెంటనే చర్యలు చేపట్టాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య కోరారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, KADAKANCHI SWARUPA, W/o. KADAKANCHI MADHUSUDHAN (New Name), previously called KADAKANCHI SWARUPA RANI (Old Name), and R/o. H.No. 2-7-13/1, Kurmawada, Jangaon Town and Mandal, Jangaon District, T.S., India. and solemnly declare, Both are Same.
NTW-00

**WANTED**

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565